సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 27 । నవంబర్ । 2024



పచ్చని అందాల నడుమ..
ఇల్లెందు మండలంలోని హజ్రత్ నాగుల్ మీరా దర్గా పచ్చని అందాల నడుమ ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటోంది. 10లో



పురాతన రాకాసి గూళ్లు!
అశ్వాపురం మండలం వేములూరు గ్రామంలో కొన్ని వేల ఏళ్ల నాటి రాకాసి గూళ్లు ఉండగా, పలువురు సందర్శిస్తున్నారు. 10లో



వాతావరణం
జిల్లాలో బుధవారం ఎండ ప్రభావం తక్కువగానే ఉంటుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి తీవ్రంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సుమనోహరం.. రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం సుమనోహరంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని శ్రీ అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, తమలపాకులతో అర్చన చేశారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో లక్ష బిల్వార్చన



బిల్వార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల వద్ద పలు రకాల పూజలు జరిపించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రజనీకుమారి, అయ్యప్ప, భవానీస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తి చాటాలి



నివాళులు అర్పిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: భావితరాలకు రాజ్యాంగ స్ఫూర్తిని చాటాలని, ఐకమత్యాన్ని పెంచాలని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇంజనీర్లు, ఉద్యోగ, కార్మికులు క్రమశిక్షణతో పనిచేసి మెరుగైన విద్యుత్ ఉత్పత్తి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఈలు వి.వెంకటేశ్వర్లు, జి.వి.ధర్మారావు, పి.కృష్ణ, బి.మోక్షపీర్, డీవైసీసీఏ పి.రామారావు, ఎస్‌పీఎఫ్ ఆర్ఐ కిరణ్, ఫైర్ ఆఫీసర్ యడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు 'నిధి ఆప్‌కే నికట్'

ఖమ్మం సహకారనగర్: ఎంప్లాయీస్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) ఆధ్వర్యాన ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం బుధవారం 'నిధి ఆప్ కే నికట్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రబీలాల్ దాస్, సునీల్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి కొత్త మున్సిపల్ కార్యాలయంలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులు పాల్వంచలోని కేఎల్ఆర్ ఫార్మసీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని సూచించారు. బుధవారం ఉదయం 9-15నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు.

అదనపు ఎస్పీ బదిలీ

కొత్తగూడెంఅర్బన్: అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) టి.సాయిమనోహర్ బదిలీ అయ్యారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాయిమనోహర్‌ను మాధాపూర్(సైబరాబాద్) ట్రాఫిక్ విభాగంలో అడిషనల్ డీసీపీగా పంపిస్తుండగా.. ప్రస్తుతం సెలవులో ఉన్న పరితోష్‌పంకజ్ జిల్లా అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్)గా కొనసాగనున్నారు.

విద్యుదుత్పత్తి పునరుద్ధరణ

పాల్వంచ: సాంకేతిక సమస్య కారణంగా కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తిని మంగళవారం పునరుద్ధరించారు. 5వ దశ కర్మాగారంలోని 250 మెగావాట్ల సామర్థ్యం గల 9వ యూనిట్‌లో బాయిలర్ ట్యూబ్ లీకై ఉత్పత్తి నిలిచిన విషయం విదితమే. మరమ్మతుల అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు ఉత్పత్తిని రాష్ట్ర గ్రిడ్‌కు అనుసంధానం చేసినట్లు సీఈ ఎం.ప్రభాకర్ రావు తెలిపారు.

జిల్లాకు జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన కేంద్రం

- సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్ మంజూరు
- ప్రకటించిన మంత్రి తుమ్మల
- కొత్తగూడెంలో ఏర్పాటుకు అవకాశాలు!

అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ



సేంద్రియంలో ముందుకు..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఇప్పటివరకు సహజ వనరులు, పరిశ్రమలకు కేరాఫ్‌గా ఉన్న జిల్లా ఇకపై సేంద్రియ సాగులోనూ దూసుకుపోనుంది. ఈ మేరకు సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్ త్వరలో అందుబాటులోకి రానుంది.

కేంద్రం.. సానుకూలం..

తెలంగాణ ఆవిర్భావం తర్వాత సాగు విస్తీర్ణం పెరిగింది. రికార్డు స్థాయిలో వరి దిగుబడి వస్తోంది. పామాయిల్ సాగులోనూ ఖమ్మం, భద్రాద్రి జిల్లాలు దూసుకుపోతున్నాయి. దీంతో రాష్ట్రంలో జాతీయ స్థాయి వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని పామాయిల్ రైతులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు విజ్ఞప్తి చేశారు. కాగా, వరద బాధితులను పరామర్శించేందుకు ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఖమ్మంలో పర్యటించిన సందర్భంగా అగ్రికల్చర్ సెక్టార్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను తెలంగాణకు మంజూరు చేయాలని తుమ్మల కోరారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చింది. అందుకు అనుగుణంగానే సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు సంబంధించి మంత్రి తుమ్మల రెండు రోజుల క్రితం కొత్తగూడెంలో ప్రకటన చేశారు.

బెంగళూరు సంస్థకు అనుబంధంగా..

అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం.. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ తెలంగాణకు మంజూరు కానుంది. ప్రస్తుతం నేషనల్ సెంటర్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్‌కు సంబంధించి దేశ వ్యాప్తంగా జోన్ల వారీగా ఐదు ఇన్‌స్టిట్యూట్లు పని చేస్తున్నాయి. ఇందులో సౌత్ జోన్ సంస్థ బెంగళూరులో ఉంది. దీనికి అనుబంధంగా పనిచేసే సెంటర్‌ను తెలంగాణకు మంజూరు చేశారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆయిల్‌పామ్ తరహాలో పూర్తి స్థాయి సంస్థగా ఈ సెంటర్ అప్‌గ్రేడ్ అయ్యే అవకాశం ఉంది.

సేంద్రియ సాగుకు కృషి..

రైతులు, వ్యవసాయ సంఘాలు, వ్యవసాయ రంగంలో పని చేస్తున్న యూనివర్సిటీలు, పరిశోధన కేంద్రాలు, సేంద్రియ వ్యవసాయంలో పని చేస్తున్న ఎన్జీఓలు, ప్రైవేట్ కంపెనీలు, పరిశ్రమలు, ప్రజాప్రతినిధులు అందరూ ఈ ఇన్‌స్టిట్యూట్‌లో భాగస్వాములుగా ఉంటారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతున్నందున సహజ, సేంద్రియ విధానాల్లో సాగును పెంచేందుకు అవసరమైన పద్ధతులపై ఇక్కడ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీంతో పాటు పరిశోధనల ద్వారా ఆధునిక సేంద్రియ సాగు పద్ధతులను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తారు. ఆయిల్‌పామ్‌పై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు.

కొత్తగూడెంలో ఏర్పాటు..!

తెలంగాణకు మంజూరైన సేంద్రియ వ్యవసాయ పరిశోధన సంస్థలో పని చేసేందుకు దేశ వ్యాప్తంగా పేరెన్నిక గల శాస్త్రవేత్తలు వస్తుంటారు. వీరి రాకపోకలకు సులువుగా ఉండేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇప్పటికే కొత్తగూడెం మీదుగా రెండు జాతీయ రహదారులు వెళ్తుండగా, రైలు కనెక్టివిటీ కూడా ఉంది. రాబోయే నాలుగేళ్లలో కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దీంతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ ఆర్గానిక్ అండ్ నేచురల్ ఫార్మింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను సైతం కొత్తగూడెంలో ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది.

రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వస్తే

బ్రిటిష్ పాలనా కాలంలో దేశంలో ఆయిల్ ఫార్మింగ్ మొదలైంది. ఆఫ్రికా నుంచి తెచ్చిన గింజలతో తొలిసారిగా 1886లో కోల్‌కతాలో ఉన్న నేషనల్ రాయల్ బొటానికల్ గార్డెన్‌లో పెంచారు. ఆ తర్వాత 1971 నుంచి 1984 మధ్య కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తృతం చేశారు. అయినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఆయిల్‌పామ్ సాగును లాభసాటిగా మార్చేందుకు వీలుగా 1995లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగిలో రీసెర్చ్ సెంటర్ ఫర్ ఆయిల్‌పామ్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత దీనినే ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్‌గా 2009లో అప్‌గ్రేడ్ చేశారు. ఈ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటైన తర్వాత పశ్చిమ గోదావరికి సరిహద్దుగా ఉన్న అశ్వారావుపేట నియోజకవర్గంలో ఆయిల్‌పామ్ సాగు పెరిగింది. రాష్ట్ర విభజన తర్వాత ఇది తెలంగాణలోని ఇతర జిల్లాల్లోనూ విస్తరించడం మొదలైంది.

నిరాశే మిగిలింది..

- కొత్త మండలాల ప్రకటనలో చోటుదక్కని కొమరారం, బోడు
- అన్నీ అనుకూలతలే.. అయినా అడుగడుగునా జాప్యమే
- ఇల్లెందు డివిజన్ కేంద్రం ఏర్పాటు ఏమైనట్లో ?



కొమరారం గ్రామ వ్యూ

ఇల్లెందు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కొత్త మండలాల జాబితాలో కొమరారం, బోడుకు మళ్లీ నిరాశే మిగిలింది. ఇక ఇల్లెందు డివిజన్ కేంద్రం ఊసే ఎత్తలేదు. రాష్ట్రంలో 32 కొత్త మండలాలను ప్రకటిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో భద్రాచలాన్ని నూతన మండలంగా ప్రకటించారు. కొమరారం, బోడు గ్రామాలను మండల కేంద్రాలుగా ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా ఆందోళనలు సాగుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ రెండింటితో పాటు ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల మండలాలను కలిపి ఇల్లెందు డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే ఈ ప్రాంత వాసుల కోరిక సైతం అటకెక్కినట్టే అయింది.

అన్నీ అనుకూలతలే..

కొమరారాన్ని మండల కేంద్రంగా ఏర్పాటుచేస్తే తహసీల్దార్, వ్యవసాయశాఖ అధికారి కారాలయాలు అందుబాటులో ఉన్నాయి. ఎంఈఓ కార్యాలయం మాత్రమే కొత్తగా ఏర్పాటు చేయాలి. ఇప్పటికే కొమరారం పరిధిలో కాచనపల్లిలో పోలీస్ స్టేషన్, కొమరారంలో హైస్కూల్, ఆంధ్రాబ్యాంక్, ఏపీజీవీబీ బ్రాంచ్, పశు వైద్యశాల, పీహెచ్‌సీ, సబ్ స్టేషన్, సబ్ పోస్టాఫీస్, అటవీ శాఖ రేంజ్ కార్యాలయం సిద్ధంగా ఉన్నాయి. ఇక బోడులో పోలీస్ స్టేషన్, హైస్కూల్, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన భవనాలు ఉన్నాయి. ఈ రెండింటిని మండలాలుగా ప్రకటించడంతో పాటు ఇల్లెందును ఆర్డీఓ కేంద్రంగా ప్రకటిస్తే బాగుండేదని ఈ ప్రాంత వాసులు అంటున్నారు.

మళ్లీ మండలంగా భద్రాచలం

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

భద్రాచలంఅర్బన్: భద్రాచలాన్ని మళ్లీ మండలంగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో భద్రాచలం మండలంలో ఉన్న గ్రామ పంచాయతీలన్నీ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లగా భద్రాచలం పట్టణం మాత్రమే మిగిలింది. దీంతో ఇక్కడున్న మండల పరిషత్‌ను రద్దు చేసి అధికారులు, సిబ్బందిని డిప్యూటేషన్‌పై ఆళ్లపల్లికి పంపించారు. అయితే ప్రస్తుతం పంచాయతీగా ఉన్న భద్రాచలాన్ని ఒకే పంచాయతీ, మండలంగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏళ్ల తరబడి ఎన్నికలు లేక ఎదురుచూస్తున్న భద్రాచలం గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌కు ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అడవుల సంరక్షణలో నిర్లక్ష్యం తగదు

సీసీఎఫ్ భీమానాయక్

అశ్వారావుపేటరూరల్: అడవుల సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, అలాంటి ఉద్యోగులపై కఠిన చర్యలు తప్పవని సీసీఎఫ్ భీమానాయక్ హెచ్చరించారు. మంగళవారం ఆయన ఊట్లపల్లి, లంకాలపల్లి, పాపిడిగూడెంలో పర్యటించి అటవీ ప్లాంటేషన్లు, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవుల ఆక్రమణ, కలప స్మగ్లింగ్, కొత్త పోడు జరగకుండా సిబ్బంది దృష్టి సారించాలని సూచించారు. అడవుల రక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఆ తర్వాత స్థానిక రేంజ్ కార్యాలయం వద్ద గల అటవీ శాఖ నర్సరీని సందర్శించి మొక్కలు పరిశీలించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ దామోదర్ రెడ్డి, ఫారెస్టు రేంజర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అటవీ ప్లాంటేషన్‌లో సీసీఎఫ్, ఎఫ్‌డీఓలు

'ఉద్దీపనం'తో చదువుపై ఆసక్తి

- ఐటీడీఏ పీఓ రాహుల్
- చింతగుప్పలోని జీపీఎస్ విద్యార్థుల ప్రగతిపై ఆరా



చింతగుప్పలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ

చర్ల: గిరిజన విద్యార్థులకు అందజేస్తున్న ఉద్దీపనం పుస్తకాలతో చదువుపై ఆసక్తిని కలిగించడంతో పాటు మేధాశక్తిని పెంపొందించేలా శిక్షణ ఇవ్వాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మండలంలోని చింతగుప్ప ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన పరిశీలించి విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. వారి సామర్థ్యాలను పరీక్షించి అభినందించారు. వీరిని గురుకులంలో చేర్పించేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఆ తర్వాత బత్తినపల్లి, కుర్నపల్లి గ్రామాల్లో చెక్‌డ్యామ్‌లను పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా లేక నీరు వృథాగా పోతుండడంతో రైతులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కొత్తగా నిర్మించాల్సిన చెక్‌డ్యామ్‌లతో పాటు ప్రస్తుతం మరమ్మతు చేయాల్సిన వాటికి సంబంధించి ప్రతిపాదనలు తయారుచేయాలని ఆదేశించారు. కుర్నపల్లిలో ఇటీవల నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఎస్ఓ భాస్కరన్, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఇరిగేషన్ డీఈలు తిరుపతి, హరీష్, ఏఈ యుగంధర్, టీఏ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వచ్చేనెల 18 నుంచి డీఈఎల్ఈడీ పరీక్షలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో డిసెంబర్ 18 నుంచి డీఈఎల్ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) మొదటి సంవత్సరం పరీక్షలు జరుగుతాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 2023 - 25 బ్యాచ్ విద్యార్థులతో పాటు గతంలో ఫెయిలైన వారు కూడా హాజరు కావచ్చని పేర్కొన్నారు. కోర్టు సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని, వివరాలకు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు (9989027943)ను సంప్రదించాలని తెలిపారు.

రాజ్యాంగంతోనే సంక్షేమ ఫలాలు

కలెక్టర్ జితేష్ వి పాటిల్



అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాజ్యాంగం ద్వారానే ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత ఉద్యోగులు, సిబ్బందితో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. దేశంలో ఎలాంటి వివక్షతకు తావులేకుండా అందరికీ అన్ని రంగాల్లో సమాన అవకాశాలు వస్తున్నాయంటే అది రాజ్యాంగం కల్పించిన ఘనతేనని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో పలు దేశాలు తమ రాజ్యాంగానికి తగ్గట్టుగా నడుస్తున్నాయని అన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందని, అందరినీ సమానంగా చూడాలని, అవకాశాలివ్వాలని, ఏ వ్యక్తి అయినా తనకు నచ్చిన మతాన్ని స్వీకరించవచ్చని, ఎవరికైనా ప్రశ్నించే హక్కు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనా అధికారి శ్రీరామ్, సీపీఓ సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం న్యూఢిల్లీ నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోళ్ల నివేదికలను ప్రతీ రోజు అందజేయాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించేలా చూడాలని సూచించారు. ధాన్యం రవాణాలో జాప్యం చేయొద్దని, రైస్ మిల్లులకు ట్యాగింగ్ పూర్తి చేయాలని చెప్పారు. ఈనెల 30న నిర్వహించనున్న రైతుల పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతు రుణమాఫీ, సన్న రకం ధాన్యానికి బోనస్, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ఆ వేదికలో అవగాహన కల్పించాలని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, సీపీఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు, డీఎస్ఓ రుక్మిణి, పౌరసరఫరాల డీఎం త్రినాథ్ బాబు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నరేందర్, జిల్లా సహకార అధికారి ఖుర్షీద్, జీసీసీ డీఎం కె.సమ్మయ్య, మేనేజర్ కె పాపారావు పాల్గొన్నారు.

పక్కా పథకం ప్రకారమే..

- ముఠాగా ఏర్పడి నకిలీ బంగారంతో బ్యాంకులకు బురిడీ
- తొలుత ఖాతాలు తెరిచి నమ్మబలికిన మోసగాళ్లు
- ఓ ఫైనాన్స్ సంస్థ గుర్తించడంతో బయటపడిన దగా

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల కాలంలో బంగారం ధరలు పెరగడంతో వన్ గ్రామ్ గోల్డ్, పూత బంగారు ఆభరణాలపై పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. దీనికి అనుగుణంగా వ్యాపారులు వన్ గ్రామ్‌కు బదులు మరో రెండు, మూడు గ్రాముల బంగారం పూతతో ఆభరణాలను మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. ఇక బంగారం ధర, నాణ్యత ఆధారంగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు తాకట్టు పెట్టుకుని రుణాలు ఇస్తున్నాయి. దీంతో కొందరు ముఠాగా ఏర్పడి నకిలీ ఆభరణాలనే అసలైనవిగా నమ్మించి బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల్లో రుణాలు తీసుకుని ముఖం చాటేశారు.

తయారీ కేంద్రాల నుంచే...

బంగారు పూతతో ఆభరణాలు రూపొందించే ఏపీలోని చిలకమర్రు, బందర్ తదితర ప్రాంతాలకు వెళ్లిన ముఠా సభ్యులు అక్కడి వ్యాపారులను మచ్చిక చేసుకున్నట్లు తెలిసింది. ఆతర్వాత 25 గ్రాముల చొప్పున బ్రాస్‌లెట్లు, ఇతర ఆభరణాలు చేయించి వాటిని 4 గ్రాముల అసలు బంగారంతో పూత వేయించినట్లు సమాచారం. ఆపై ఆభరణాలను తాకట్టు పెట్టి రూ.2 లక్షల మేర రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. అయితే, ముఠా సభ్యులెవరూ నేరుగా బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలకు వెళ్లకుండా తరచూ బ్యాంకులతో సంబంధం ఉండే వారిని పరిచయం చేసుకుని పది శాతం కమీషన్ ఇస్తూ నకిలీ ఆభరణాలు తాకట్టు పెట్టించారని సమాచారం. మొదట వారిని నమ్మబలికేలా బ్యాంకుల్లో తప్పుడు ధ్రువపత్రాలతో ఖాతాలు కూడా తెరిచినట్లు తెలిసింది. జిల్లా కేంద్రంలోని పలు ఫైనాన్స్ సంస్థలు, వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులే కాక డీసీసీబీ శాఖల్లో వీటిని తాకట్టు పెట్టగా.. ముఠాలో పురుషులతో పాటు పాటు ముగ్గురు మహిళలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

అనుమానంతో ఆరా తీయగా..

ఖమ్మంలోని ఓ ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ అధికారులకు వచ్చిన అనుమానంతో ఈ దగా బయటపడింది. ఫైనాన్స్ సంస్థ యాజమాన్యం తమ వద్ద తాకట్టు పెట్టిన కడియాల అతుకుల వద్ద తేడాను గుర్తించినట్లు సమాచారం. దీంతో పరీక్ష చేయించగా బంగారం పూతతో చేయించిన ఆభరణాలుగా తేలగా.. రుణాలు తీసుకున్న వారిపై ఒత్తిడి తీసుకొస్తూనే బ్యాంకులకు కూడా సమాచారం అందించినట్లు తెలిసింది. దీంతో అధికారులు అప్రమత్తమై పరీక్షలు చేయించడంతో చాలా బ్యాంకు శాఖల్లో ఇలాంటి ఆభరణాలతో రుణాలు పొందినట్లు వెలుగుచూసింది. ఇప్పటికే అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ముఠా సభ్యులను గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం.

సాంకేతికత పెరిగినా దూరమే..

బంగారం ఆభరణాల నాణ్యత పరీక్షించేందుకు యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అయినా బ్యాంకులు, సంస్థల్లో మాత్రం వారు నియమించుకున్న అప్రైజర్ల అనుభవంతోనే నాణ్యతను నిర్ధారించి రుణాలు మంజూరు చేస్తున్నారు. ప్రస్తుతం ద్రావకం, ఎక్స్ రే కిరణాల ద్వారా(ఎక్ఆర్ఎఫ్) బంగారం నాణ్యతను గుర్తించే అవకాశమున్నప్పటికీ ఎవరూ వినియోగించడం లేదు. ఈ విషయాన్ని గుర్తించిన ముఠా సభ్యులు మోసానికి తెరలేపి అందిన కాడికి దండుకున్నారు.

రుణాల రికవరీకి మూడు రోజుల గడువు

జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోని పలు బ్రాంచ్‌ల ద్వారా నకిలీ బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్నట్లు తేలడంతో ఇటీవల సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.వెంకటఆదిత్య ప్రత్యేక దృష్టి సారించారు. మూడు రోజుల్లోగా ఇలాంటి వారిని గుర్తించి రుణం రికవరీ చేయాలని, లేనిపక్షంలో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. రుణాలు ఇచ్చే సమయాన ఆభరణాలను పరిశీలించిన అప్రైజర్లను కేసులో బాధ్యులుగా చేయాలని సూచించినట్లు సమాచారం.

క్లుప్తంగా

కూలిన 'సీతారామ' కెనాల్ లైనింగ్



మొండికుంటలో కూలిన సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ లైనింగ్

అశ్వాపురం: మండలంలోని మొండికుంట నుంచి కృష్ణసాగర్ వరకు సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ లైనింగ్ పలు చోట్ల కూలింది. ఇటీవల తుమ్మలచెరువు అలుగుకు మొండికుంట ఏరియాలో కెనాల్ లైనింగ్ కూలగా ఇప్పుడు కృష్ణసాగర్ వరకు పలుచోట్ల లైనింగ్ కూలింది. సీతారామ ప్రాజెక్ట్ కెనాల్‌లో నీరు రాకముందే లైనింగ్ కూలడంతో కెనాల్ నుంచి నీరు సరఫరా ఐతే లైనింగ్ పరిస్థితి ఏమిటని స్థానిక రైతులు అంటున్నారు. లైనింగ్‌ను నాణ్యతతో నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఈఈ వెంకటేశ్వరరావును వివరణ కోరగా లైనింగ్ కూలిన విషయం తమ దృష్టికి వచ్చిందని, లైనింగ్ నిర్మించే పనులు చేపడుతామన్నారు.

ముస్లిం మైనార్టీ ఉద్యోగుల కమిటీలు ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీల ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి ముస్లిం మైనార్టీ ఉద్యోగుల కమిటీలను ఎన్నుకున్నారు. ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం టీఈఈఎంఎంఏ కంపెనీ ప్రెసిడెంట్ ఫారూఖ్, కార్యదర్శి మహ్మద్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా అడ్వైజర్‌గా ఎస్‌కే బాబును ఎన్నుకున్నారు. అలాగే, ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా షేక్ ఖాదర్‌బాబా, కార్యదర్శిగా సయ్యద్ ఇమాం సాహెబ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ అబ్దుల్ ఖదిర్, కోశాధికారిగా అమీర్, మహిళా ప్రతినిధిగా షేక్ రజియా బేగం ఎన్నికయ్యారు. భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా ఎండీ యాసిన్, కార్యదర్శిగా ఎస్‌కే సోందుమియా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎండీ దిల్షాద్ పాషా, కోశాధికారిగా ఎండీ అబ్దుల్ అజీజ్‌ఖాన్‌తో పాటు మహిళా ప్రతినిధిగా ఎస్‌కే రజియాబేగంను ఎన్నుకున్నారు.

భద్రాచలం కోర్టులో పీఠిక పఠనం



కోర్టులో పీఠిక పఠనం చేస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో పీఠిక పఠనం నిర్వహించారు. భద్రాచలం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జ్యుడీషియల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి శివనాయక్ పాల్గొని మాట్లాడారు. రాజ్యాంగం అవతరించి 75 ఏళ్లు అయిన సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌తో పాటు రాజ్యాంగం రూపొందించేందుకు కృషి చేసిన ఇతర గొప్ప నేతల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు రమ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు కోర్ట్ సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట ఖరారు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం పర్ణశాలలో సెల్‌ఫోన్‌లను భద్రపరచే వేలంపాట ఆలయ ఈఓ రమాదేవి సమక్షంలో మంగళవారం నిర్వహించారు. ఈ వేలంపాటలో 14 మంది పాల్గొనగా ముసలి గోవింద్ రూ.6,35,000కు దక్కించుకున్నారు. గతేడాది రూ.3,80,000 పాట పోగా ఈ ఏడు రెట్టింపు ఆదాయం ఆలయానికి సమకూరింది. ఏఈఓ భవాని రామకృష్ణ, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలింపునకు అడ్డుకట్ట

మణుగూరుటౌన్: మండలంలోని చినరావిగూడెంలో గతంలో ఇసుక ర్యాంప్ నిర్వహించి కాలం ముగిసిన అనంతరం మిగిలిన ఇసుక సీజ్ చేయగా, దానిని వేలంపాటలో దక్కించుకున్న వ్యక్తి మంగళవారం తరలించే ప్రయత్నం చేశాడు. దీనిని స్థలం బాధ్యులు అడ్డుకున్నారు. సీజ్ చేసిన ఇసుక కింద ఉన్న నేలను చదును చేసి అప్పగించాలని, లేకుంటే కదిలేది లేదని భీష్మించారు. రాయిగూడెం ఇసుక క్వారీ సమ్మక్క - సారక్క సొసైటీ రెండు వర్గాలుగా చీలగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో వేలంపాట నుంచి దక్కించుకున్న వ్యక్తి కోర్టు నోటీసులను చూపుతూ రెవెన్యూ, పోలీసు అధికారులను ఆశ్రయించాడు. అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సీజ్ చేసిన ఇసుకను విక్రయించుకునే వారికి భూమి చదును చేసే బాధ్యత ఉండదని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

తాగి నడిపితే జైలుకే..!

డ్రంకెన్ డ్రైవ్‌పై భద్రాచలం పోలీసుల నజర్

- నిత్యం పరీక్షలు, వాహనాల తనిఖీలు
- మోతాదు మించితే జరిమానా, జైలుశిక్ష విధించేలా చర్యలు
- ఈ ఏడాది ఇప్పటివరకు 1,171 కేసులు



డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుశాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టి మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో సరిపెట్టేవారు. కానీ, ప్రస్తుతం కేసులు నమోదైతే మందుబాబులను జైలుకు తరలిస్తున్నారు. దీంతో మందుబాబులు హడలెత్తిపోతున్నారు.

మద్యం తాగి రోడ్లపైకి..

మద్యం తాగి వాహనాలు నడపడం ముప్పని తెలిసినా చాలా మంది తాగి వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. విందులు, వినోదాల్లో పాల్గొంటూ మత్తు ఎక్కిన తర్వాత కూడా వాహనాలు నడుపుతున్నారు. దీంతో పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. పట్టుబడిన మందుబాబుల పై కేసులు నమోదు చేసున్నారు. బ్రీత్ ఎనలైజర్‌లో మందుబాబుల బ్లడ్ ఆల్కహాల్ శాతం (బీఏసీ) అధికంగా నమోదవడం చూసి పోలీసులు ఆశ్చర్యపోతున్నారంటే అతిశయోక్తి కాదు. పోలీసుల నిబంధనల ప్రకారం.. ప్రతీ 100 మి.లీ రక్తంలో బీఏసీ శాతం 30కి మించకూడదు. కానీ, బ్రీత్ అనలైజర్ టెస్ట్‌లో మందుబాబులు సెంచరీ కొడుతున్నారు.

వెంటనే కేసులు నమోదు..

పోలీసు శాఖ డ్రంకన్ డ్రైవ్ చేస్తున్నప్పుడు పట్టుబడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు చేసి మద్యం తాగినట్లు తేలగానే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. భద్రాచలంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 1,171 మంది మందుబాబులపై డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మోతాదుకు మించి మందు తాగి వాహనాలు నడిపి పట్టుబడుతున్నవారికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తున్నారు. వాహన ధ్రువపత్రాలు లేకుండా, మద్యం తాగి వాహనం నడిపిన సందర్భాల్లో శిక్ష ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని ట్రాఫిక్ పోలీసులు చెబుతున్నారు. అలాగే, పోలీసులు వాహనాల తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 32,960 మందికి రూ.66,10,235 జరిమానా విధించారు. వీరిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 10 మంది డ్రైవింగ్ లైసెన్సులను ట్రాఫిక్ పోలీసులు రద్దు చేశారు.

అవగాహన తప్పనిసరి..

భద్రాచలంలో చాలామంది డ్రంకన్ డ్రైవ్ చేస్తూ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండటంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. వారు నడిపే వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో పాటు వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మద్యం తాగి వాహనం నడిపినట్లు నిర్ధారణ కావడంతో ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం కూడా అందడం లేదు. ఇటీవల కాలంలో మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో మరణించే వారిలో ఎక్కువ సంఖ్యలో యువకులే ఉండడం గమనార్హం. ప్రతిఒక్కరూ డ్రంకన్ డ్రైవ్‌తో పాటు రోడ్డు నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ అంకిత్‌కుమార్

కేసులు నమోదు చేస్తున్నాం



మద్యం మత్తులో వాహనాలు నడిపితే జీవితాలు ప్రమాదంలో పడడమే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా హాని కలుగుతుంది. ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నాం. పట్టు బడిన వారికి కేసు తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తున్నారు. యువత కేసుల్లో ఇరుక్కోవద్దు. తద్వారా భవిష్యత్ నష్టపోయే ప్రమాదముంది. ఎంతటి వారైనా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. మద్యం తాగి ఎవరూ వాహనాలు నడపొద్దు.

–మధుప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ, భద్రాచలం

లోడ్ లేదు.. బండి కదలదు

- లారీలకు బొగ్గు లోడ్ ఇవ్వని సింగరేణి
- కిస్తీలు చెల్లించలేకపోతున్నామని యజమానుల ఆవేదన



సత్తుపల్లిలో నిలిచిపోయిన లారీలు

సత్తుపల్లి: సింగరేణినే నమ్ముకుని లారీలు కొనుగోలు చేసిన వారు ఇప్పుడు అవస్థలు పడుతున్నారు. సంస్థ నుంచి లారీలకు బొగ్గు లోడ్ ఇవ్వకపోవడంతో బండి కదల పూట గడవని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. సత్తుపల్లికి రైలు మార్గం ఏర్పాటుచేసినా ఆనందించినా.. ఈ కారణంగానే స్థానిక లారీలకు లోడింగ్‌లు లేక యజమానులు, డ్రైవర్లు వీధిన పడాల్సి వస్తోంది.

750 లారీలపై జీవనం

సత్తుపల్లి జేవీఆర్ ఓసీ నుంచి రోజుకు 25వేల మెట్రిక్ టన్నులు, కిష్టారం ఓసీ నుంచి 6వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. ఈ రెండు ఓసీలపై ఆధారపడి 750 లారీలు నడిపిస్తుండగా ప్రత్యక్షంగా 2వేల మంది, పరోక్షంగా 5వేల మంది ఉపాధి పొందుతున్నారు. అయితే, రైల్వే లైన్ వచ్చాక వ్యాగన్లలో బొగ్గు తరలిస్తూ లారీలను పట్టించుకోవడం లేదు. దీంతో నెలకు కనీసం రెండు నుంచి మూడు ట్రిప్పుల లోడింగ్ కూడా దొరికే పరిస్థితి లేదు. ప్రస్తుతం సత్తుపల్లి లారీ యజమానుల ఆఫీస్ నుంచి రోజుకు 25 నుంచి 30 లారీలకు మాత్రమే లోడింగ్‌లు ఇస్తున్నారు. సింగరేణి సంస్థ నుంచి గతంలో ఇక్కడి నుంచి కాకినాడ పోర్టుకు లారీల ద్వారానే బొగ్గు తరలించేది. మూడేళ్లుగా కాకినాడకు రవాణా నిలిచిపోవటంతో లారీ యజమానులకు, డ్రైవర్లకు ఉపాధి కరువైంది. ఇకపోతే సకాలంలో లారీలకు ఫైనాన్స్ చెల్లించలేక ఇప్పటికే ముగ్గురు లారీ యజమానులు మృత్యువాత పడ్డారని చెబుతున్నారు. మరికొందరు ఫైనాన్స్ కిస్తీలు చెల్లించలేక, కుటుంబాలను పోషించలేక లారీలను వదులుకోవాల్సిన దుస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్టర్లతో చర్చించి..

బొగ్గు కాంట్రాక్టర్లతో చర్చించి కాకినాడ, తడికలపూడికి లారీల ద్వారా బొగ్గు తరలింపునకు టెండర్లు పిలిచి పర్మిట్లు ఇస్తే రోజుకు 120 లారీలకు లోడ్ అందుతుందని యజమానులు చెబుతున్నారు. సింగరేణి యాజమాన్యం ఈ అంశంపై దృష్టి సారించాలని కోరుతున్నారు. సింగరేణి విస్తరణలో భాగంగా సత్తుపల్లి మండలంలోని కిష్టారం, కొమ్మేపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములు కోల్పోయి నిర్వాసితులుగా మారారని, 250 మంది వరకు లారీలు కొనుగోలు చేస్తే ఇప్పుడు చిన్నచూపు చూస్తున్నారని వాపోతున్నారు.

రైలు బంద్‌కు వెనుకాడం..

లారీలకు బొగ్గు లోడింగ్ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనలు చేపట్టడానికి లారీల యజమానులు, డ్రైవర్లు సిద్ధమవుతున్నారు. సత్తుపల్లి ఓసీల్లో నాణ్యమైన జీ–8, జీ–13 బొగ్గు నిల్వలు ఉన్నాయని.. వీటిని మార్కెటింగ్ చేస్తే ఈ ప్రాంతం నుంచి బొగ్గు తీసుకెళ్లేందుకు కాంట్రాక్టర్లు ముందుకొస్తారని చెబుతున్నారు. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని యాజమాన్యం సమస్యలను పరిష్కరించకపోతే రైలు బంద్ చేపట్టేందుకు వెనుకాడబోమని హెచ్చరిస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం...



లారీలకు బొగ్గు లోడింగ్‌లు ఇవ్వకపోతే ఆందోళన చేస్తామని ఇప్పటికే సింగరేణి అధికారులకు చెప్పాం. సత్తుపల్లి నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారు. యాజమాన్యం వారికి పర్మిట్లు ఇస్తే లోడింగ్ సమస్య తీరుతుంది.

– రావి నాగేశ్వరరావు, లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు, సత్తుపల్లి

ఫైనాన్స్ కట్టలేకపోతున్నాం..



లారీలకు సరిగా లోడ్ దక్కక ఫైనాన్స్ కట్టలేక ఇబ్బంది పడుతున్నాం. నెలకు రెండు, మూడు లోడ్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. లారీలపై ఆధారపడి మా కుటుంబాలు జీవిస్తున్నాయి. మా భూములను సింగరేణికి ఇస్తే మమ్మల్ని నట్టేట ముంచారు.

– ఎస్.కే.ఖలీల్, లారీ యజమాని, సత్తుపల్లి

సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మణుగూరురూరల్: పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రతీ చేతి వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్, బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు కోరారు. మున్సిపాలిటీలోని స్నేహగార్డెన్‌లో పీఎం విశ్వకర్మ యోజన జిల్లా కోఆర్డినేటర్ ఆకుల నాగేశ్వరరావుగౌడ్ అధ్యక్షతన మంగళవారం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. చేతి వృత్తుల వారి కోసం పీఎం విశ్వకర్మ యోజన ప్రవేశపెట్టారని, అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో పొడియం బాలరాజు, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, జంపన సీతారామరాజు, పున్నం భిక్షపతి, ఎం.దుర్గారావు, డి.వెంకటేశ్వర్లు, లింగంపల్లి రమేశ్, కృష్ణ, కె.శ్రీనివాస్, చెన్నారావు, ఎస్.మోహన్‌రావు, కె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల నియంత్రణకు సర్వే చేపట్టాలి



రికార్డులు తనిఖీచేస్తున్న డీఎంహెచ్ఓ

కొత్తగూడెంరూరల్ : మండలంలోని రేగళ్ల పీహెచ్‌సీ పరిధిలోని బంగారుచెలక, మైలారం సబ్ సెంటర్లను డీఎంహెచ్ఓ ఎల్.భాస్కర్‌నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జ్వరాల నియంత్రణకు సర్వే చేయాలని, ఇంటింటికీ తిరిగి జ్వర పీడితుల వివరాలు సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. మైలారం సబ్‌సెంటర్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పార్వతి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న డీజీఎం చేతన్, ప్రిన్సిపాల్ శర్మ తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనబర్చిన శ్రీచైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈమేరకు విద్యార్థులను ఖమ్మం మమత రోడ్డులోని పాఠశాలలో వారు మంగళవారం అభినందించి మాట్లాడారు. అండర్–14 బాలుర విభాగం కబడ్డీలో సోను, వాలీబాల్‌లో ఎస్.డీ.అర్షిద్, కరాటేలో లోకేష్, అండర్–14 బాలికల విభాగం వాలీబాల్‌లో అర్షియా జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో డీజీఎం చేతన్ మాథూర్, ప్రిన్సిపాళ్లు టీఎల్ఎన్.శర్మ, నాగప్రవీణ, ఏడుకొండలు, పీఈటీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గోవులను పట్టుకున్న పోలీసులు

అశ్వాపురం: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వంతెన ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 20 గోవులను మంగళవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడి నుంచి పాల్వంచ గోశాలకు తరలించారు. చర్ల నుంచి గోవులను అశ్వాపురం తరలించి ఇక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తున్నట్టు సమాచారం. కొంతకాలంగా చర్ల, దుమ్ముగూడెం ప్రాంతాల నుంచి గోవులను కొందరు వ్యక్తులు అక్రమంగా అశ్వాపురం మండలానికి తరలించి రాత్రి సమయాల్లో హైదరాబాద్ తరలిస్తున్నట్లు తెలుస్తోంది.

లారీడ్రైవర్ ఆత్మహత్య

ఖమ్మంక్రైం: జీవితంపై విరక్తి చెందిన ఓ లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం త్రీటౌన్ సీఐ రమేష్ వెల్లడించిన వివరాలు... కారేపల్లి మండలం మద్రిగూడెంకు చెందిన కొంకా రామారావు(40) భార్య ఆరేళ్ల క్రితం విడిచి వెళ్లడంతో ఆయన ఖమ్మం బైపాస్‌రోడ్డులో ఉన్న లారీ ఆఫీస్‌లోనే ఉంటూ అద్దె లారీల డ్రైవర్‌గా వెళ్తున్నాడు. కొన్నాళ్లుగా ముభావంగా ఉంటున్న ఆయన సోమవారం రాత్రి వరకు స్థానికులతో మాట్లాడాడు. అయితే, మంగళవారం ఉదయం సెక్యూరిటీగార్డు గమనించగా సమీపంలోని చెట్టుకు రామారావు ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా ఆయన తండ్రి సైదయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

మధిర(చింతకాని): మండలంలోని సీతంపేటకు నలుగురు పేకాట ఆడుతుండగా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. గ్రామ శివారు మామిడి తోటలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో తనిఖీలు చేపట్టగా నలుగురు పట్టుబడ్డారని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. ఈ సందర్భంగా వారి నుంచి నాలుగు బైక్‌లు, సెల్‌ఫోన్లు, రూ.10,950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మద్దతు ధర ఇవ్వాల్సిందే..

ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిలో నాయకులు



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సంఘాల నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు రైతు కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని అఖిల పక్ష కార్మిక రైతు వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. కిసాన్ సంయుక్త మోర్చా (ఎస్‌కేఎం) జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ల(జేపీటీయూ) పిలుపులో భాగంగా మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబా, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావుతోపాటు ఐఎస్టీయూసీ, టీయూసీఐ, ఏఐకేఎస్, ఏఐపీకేఎస్, బీకేఎస్‌యూ, ఏఐడబ్ల్యూయూ, ఏఐపీకేఎంఎస్, ఐఐకేఎంఎస్ నాయకులు పాషా, జె..రామయ్య, దొండపాటి రమేష్, బొంతు రాంబాబు, ఆవుల వెంకటేశ్వర్లు, తాటి వెంకటేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వరరావు, ఎం.హన్మంతరావు, వై.ప్రకాష్ తదితరులు మాట్లాడారు. ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్న కేంద్రప్రభుత్వం ఎన్నికలకు ముందు చేసిన హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఇకనైనా పంటలకు కనీసం మద్దతు ధర ప్రకటించడమేకాక వ్యవసాయ నల్ల చట్టాలు, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, రైతులందరికీ రుణమాఫీ చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో వివిధ సంఘాల నాయకులు నరాల నరేష్, మోహన్‌నాయుడు, పాల్వంచ కృష్ణ, సైదుబాబు, నాగేశ్వరరావు, గాదె లక్ష్మీనారాయణ, గారపాటి అశోక్, ఎస్‌కే.చాంద్ పాషా, కళ్యాణం వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్, ఆవుల అశోక్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, భాగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీలాద్రీశ్వరుడికి అన్నాభిషేకం



అన్నాభిషేకం అనంతరం నీలాద్రీశ్వరుడు

పెనుబల్లి: మండల పరిధిలోని నీలాద్రీశ్వర ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఈమేరకు కార్తీక ఏకాదశి సందర్భంగా మంగళవారం స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. సాయంత్రం పెద్దసంఖ్యలో హాజరైన మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు.

50 బస్తాల ధాన్యం సీజ్

వేంసూరు: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం కేంద్రంలో అమ్మేందుకు సిద్ధమయ్యారనే ఆరోపణలు రావడంతో మండలంలోని దుద్దెపూడిలో 50 బస్తాల ధాన్యాన్ని అధికారులు మంగళవారం సీజ్ చేశారు. దుద్దెపూడికి చెందిన ఒక రైతు తండ్రి పేరిట భూమిలో సాగు చేసిన ధాన్యాన్ని భరిణపాడు సహకార సంఘం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లగా తేమ ఎక్కువగా ఉండడంతో నిరాకరించారు. దీంతో గ్రామానికే చెందిన మరో రైతుకు విక్రయించగా ఆయన తన ధాన్యంతో పాటు కలిపి భీమవరం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్తే అక్కడా తేమ, తాలు పేరిట నిరాకరించారు. ఈమేరకు ఆయన ఇంటికి తీసుకెళ్లడంతో దళారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వ కేంద్రాల్లో అమ్ముతున్నట్లు ఫిర్యాదులు అందాయి. దీంతో అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు విచారణ చేపట్టి 50 బస్తాల ధాన్యాన్ని సీజ్ చేసినట్లు ఏపీడీ మహ్మద్ నూరుద్దీన్, తహసీల్దార్ ఎం.ఏ.రాజు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ



గాయపడిన వ్యక్తిని ఆటోలో ఎక్కిస్తున్న దృశ్యం

జూలూరుపాడు: మండల కేంద్రంలో మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. జూలూరుపాడు శ్రీషిర్డీ సాయిబా బా ఆలయం వైపు నుంచి ఓ వ్యక్తి బైక్‌పై కొత్తగూడెం వైపు వెళ్తున్నాడు. పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్ కొట్టించుకొని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు రోడ్డు దాటుతున్న క్రమంలో రెండు బైక్‌లు ఢీకొనగా ముగ్గురు గాయపడ్డారు. అదే సమయానికి గిర్దావర్ తిరుపతిరావు అటు వైపు వెళ్తూ క్షతగాత్రులను స్థానికుల సాయంతో ఆస్పత్రికి తరలించారు. గాయపడినవారిలో కొమ్ముగూడేనికి చెందిన వ్యక్తి అని, మరో ఇద్దరు కాకర్ల గ్రామానికి చెందినవారని స్థానికులు తెలిపారు.

నాగుపాములను అడవిలో వదిలిన స్నేక్ క్యాచర్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణం జనావాసాల్లోకి వచ్చిన నాగుపాములను మంగళవారం ప్రాణధార స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. కొత్తగూడెం పరిసరాలల్లోకి వచ్చిన పాములను సమాచారం అందిన వెంటనే వెళ్లి పట్టుకొని, సురక్షితంగా జనావాసాలకు దూరంగా అడవిలో వదిలిపెట్టారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. వన్య ప్రాణులను కాపాడటం పర్యావరణ సమతుల్యతలో భాగమేనని, భయపడకుండా గమనిస్తూ సమాచారం ఇవ్వాలన్నారు.



పాములను వదిలేస్తున్న సంతోష్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గోపి (ఫైల్)

చంద్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. రావికంపాడుకు చెందిన వ్యవసాయకూలీ గుమ్మా గోపి (24) తన ఇంట్లో ప్రమాదవశాత్తు సర్వీస్ వైరును తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య అశ్విని, ఇద్దరు పిల్లలు న్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఢీకొని గేదెలు మృతి

సుజాతనగర్: ఆర్టీసీ బస్సు ఢీకొని రెండు గేదెలు మృతి చెందిన ఘటన స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భద్రాచలం నుంచి 50 మంది ప్రయాణికులతో ఖమ్మం వెళ్తోంది. రైల్వే ఓవర్ బ్రిడ్జిపైకి వచ్చిన బస్సుకు అకస్మాత్తుగా మరో వైపు నుంచి గేదెలు ఎదురుగా వచ్చాయి. బస్సు ఢీకొట్టడంతో రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందగా.. మూడు గేదెలు గాయపడ్డాయి. కాగా, గేదెలు ఎవరివనే విషయం తెలియరాలేదు.

రోడ్డు ప్రమాద మృతుడి గుర్తింపు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధి శాంతినగర్ సమీపంలో నాలుగు రోజుల కిందట మృతి చెందిన వ్యక్తిని కొత్తగూడెం వాసిగా గుర్తించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొనగా సదరు వ్యక్తి మృతి చెందాడు. మృతుడిని కొత్తగూడెంలోని మేదర్‌బస్తీకి చెందిన సమీవుల్లా కుమారుడు సయ్యద్ రఫీగా గుర్తించామని పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా...


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ తదితరులు

ఆలయ భూముల్లో సోలార్ ప్లాంట్లు

దేవాదాయ మంత్రి కొండా సురేఖ వెల్లడి

పెద్దపల్లి రూరల్: దేవాదాయశాఖ భూముల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు స్థాపించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలోని శ్రీకోదండ రామాలయ ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంత్రి మంగళ వారం శంకుస్థాపన చేశారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, కలెక్టర్ కోయ శ్రీహర్ష తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఆలయ భూములు అన్యాక్రాంత మయ్యాయని, వాటిపై విచారణ జరిపి స్వా. దీనం చేసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఆ భూముల్లో మహిళా సంఘాలతో సౌరశక్తి ప్రాజెక్టులు ఏర్పాటు చేసి ఆదాయం పొందేలా చూస్తామని, మిగతా భూముల్లో ఆయిల్‌పాం సాగుకు చర్యలు తీసుకుంటామని వివరించా రు. వేములవాడ, యాదగిరిగుట్ట ఆలయాల అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని సురేఖ తెలిపారు. ఆలయ గోపురాలకు బంగారు తాపడాలు చేపట్టే పను లు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. వేములవాడ ఆలయానికి వెండితో పల్లకీ తయారు చేయించే ఆలోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు.

‘డబుల్’ కాలనీల్లో మౌలిక వసతులకు రూ.196.46 కోట్లు

సాక్షి, హైదరాబాద్: డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలను జనావాసాలకు వీలుగా మార్చేందుకు మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ కాలనీల్లో చాలా చోట్ల కనీస వసతులు కూడా లేకపోవటంతో జనం ఉండే పరిస్థితి లేకుండా పోయింది. తాగునీరు, కరెంటు కనెక్షన్, రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల నిర్మాణం లాంటివి చేపట్టేందుకు వీలుగా రూ.196.46 కోట్ల మొత్తాన్ని మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది.

‘రైల్వే’ కిల్లర్!

- ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని వికలాంగుల బోగీలో సంచారం
- 35 రోజుల్లో ఐదు రాష్ట్రాల్లో అత్యాచారాలు, హత్యలు
- నిందితుడిని పట్టుకున్న గుజరాత్‌లోని వల్సాద్ కాప్స్
- సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఒకటి చేసినట్లు అంగీకారం
- పీటీ వారెంట్‌పై ఇక్కడకు తీసుకురానున్న రైల్వే పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: అతడి పేరు భోలో కరమ్‌వీర్ జాట్ అలియాస్ రాహుల్.. స్వస్థలం హర్యానాలోని రోహ్తక్‌లో ఉన్న మోఖ్రా ఖాస్... గతంలో రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌ల్లో నేరాలు చేశాడు. ఇటీవల ‘రైల్వే’ కిల్లర్‌గా మారాడు. ఈ ఏడాది అక్టోబర్ 17 నుంచి ఆదివారం (ఈ నెల 24) మధ్య 35 రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లో సంచరిస్తూ ఐదు రాష్ట్రాల్లో ఐదు మర్డర్లు చేశాడు. వీటిలో కొన్ని సొత్తు కోసమైతే.. మరి కొన్ని అత్యాచారం, హత్యలు. గుజరాత్‌లోని వల్సాద్ పోలీసులు ఈ నరహంతకుడిని సోమవారం పట్టుకున్నారు. విచారణలో ఆఖరి ఘాతుకాన్ని ఆదివారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులకు వల్సాద్ పోలీసులు సమాచారం ఇచ్చారు. దీంతో పీటీ వారెంట్‌పై కరమ్‌వీర్‌ను నగరానికి తీసుకురావడానికి పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. వల్సాద్ ఎస్పీ డాక్టర్ కరణ్‌రాజ్ సింగ్ వాఘేలాను మంగళవారం ‘సాక్షి’ ఫోన్ ద్వారా సంప్రదించింది. ఆయన ఈ సీరియల్ కిల్లర్ పూర్వాపరాలు వెల్లడించారు.

చిన్ననాటి నుంచి చిత్రమైన ప్రవర్తన..

హర్యానాలోని వ్యవసాయ కుటుంబంలో పుట్టిన రాహుల్‌కు ఎడమ కాలికి పోలియో సోకింది. ఫలితంగా చిన్నతనం నుంచి ఆటపాటలకు దూరంగా ఉంటూ ఒంటరిగా ఉండేవాడు. విపరీతమైన భావాలు, చిత్రమైన ప్రవర్తన కలిగి ఉండేవాడటంతో కుటుంబం దూరంగా పెట్టింది. ఐదో తరగతితో చదువుకు స్వస్తి చెప్పిన రాహుల్ లారీ క్లీనర్‌గా పని చేస్తూ డ్రైవింగ్ నేర్చుకున్నాడు. అయితే పోలియో కారణంగా ఇతడికి ఎవరూ డ్రైవర్‌గా ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో హైవే దాబాలో కార్మికుడిగా మారిన రాహుల్... అక్కడ పార్క్ చేసి ఉన్న లారీలను తస్కరించడం మొదలెట్టాడు. దీంతో పాటు లూటీలు, కిడ్నాప్‌లకు పాల్పడ్డాడు. ఈ ఆరోపణలపై రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌ల్లో 13 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది మే వరకు రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో గడిపిన రాహుల్


కరమ్‌వీర్ జాట్

బెయిల్‌పై విడుదల య్యాడు. అక్కడ నుంచి గుజరాత్‌లోని ఉద్వాడ పట్టణానికి చేరుకుని ఓ హోటల్‌లో కార్మికుడిగా చేరాడు. కొన్ని రోజులు పని చేసి వాపి ప్రాంతానికి చేరుకుని ఫుట్‌పాత్స్ పైన గడిపాడు.

ఆ అవకాశాన్ని దుర్వినియోగం చేసుకుని..

వివిధ రైళ్లల్లో దివ్యాంగుల కోసం చివరలో ప్రత్యేక బోగీలు ఉంటాయి. వీటిలో ప్రయాణించే దివ్యాంగులను సాధారణంగా టీసీలు సైతం తనిఖీ చేయరు. పాసులు కలిగి ఉంటారనే ఉద్దేశంలోనే వదిలేస్తుంటారు. దీన్ని తనకు అనువుగా మార్చుకున్న రాహుల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లల్లోని దివ్యాంగుల బోగీల్లో ఎక్కి దేశం మొత్తం తిరగడం ప్రారంభించాడు. ఈ ఏడాది జూన్ రెండో వారం నుంచి ఇలా దేశ సంచారం చేస్తున్న రాహుల్ అక్టోబర్ 17న తొలి హత్య చేశాడు. ఆ రోజు బెంగళూరు–మురుదేశ్వర్ రైలులో ప్రయాణిస్తుండగా బీడీ కాల్చడంపై తోటి ప్రయాణికుడు అభ్యంతరం చెప్పాడు. దీంతో విచక్షణకోల్పోయిన రాహుల్ గొంతు నులిమి చంపేశాడు. ఆపై అతడి వద్ద ఉన్న సొత్తు, సొమ్ము తీసుకుని రైలు దిగిపోయాడు. దీనిపై మంగుళూరులో ఉన్న ముల్కీ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

వరుసపెట్టి మరో నాలుగు హత్యలు..

ఆపై కతిహార్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన రాహుల్ పశ్చిమ బెంగాల్‌లోని హౌరా స్టేషన్‌లో మరో వృద్ధుడి గొంతు కోసి చంపి దోపిడీకి పాల్పడ్డాడు. పుణే–కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్‌లో మరో మహిళపై అత్యాచారం చేసి, కత్తితో గొంతు కోసి హత్య చేశాడు. వీటిపై ఆయా ఠాణాలో కేసులు నమోదయ్యాయి. ఈ నెల 14న ఉద్వాడలో తాను పని చేసిన హోటల్‌కు వెళ్లి జీతం తీసుకోవాలని భావించాడు. అక్కడకు వచ్చిన రాహుల్‌కు స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై ఒంటరిగా సంచరిస్తున్న యువతి కనిపించింది. ఆమెను సమీపంలోని మామిడి తోటలోకి లాక్కెళ్లి, అత్యా చారం చేసి చంపేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న వల్సాద్ పోలీసులు ఘటనాస్థలిలో లభించిన బ్యాగ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. వివిధ రైల్వే స్టేషన్లలోని 2500 సీసీ కెమెరాల్లో ఫీడ్‌ను అధ్యయనం చేసి నిందితుడిని గుర్తించారు. ఉద్వాడ నుంచి రైలులో ఆంధ్రప్రదేశ్‌లోని మచిలీపట్నం చేరుకున్న రాహుల్ అట్నుంచి షిర్డీ, ఆపై బాంద్రా చేరుకున్నాడు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మహిళ హత్య..

అక్కడ నుంచి సికింద్రాబాద్ వచ్చిన రాహుల్ ఆదివారం తెల్లవారుజామున రైలు దిగాడు. ఆ సమయంలో తొమ్మిదో నెంబర్ ప్లాట్‌ఫామ్‌పై మంగుళూరు స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఆగి ఉంది. దాని సీట్ కమ్ లగేజ్ ర్యాక్ (ఎస్ఎల్ఆర్) కోచ్‌లో ఓ మహిళ ఒంటరిగా ఉండటం గమనించాడు. ఆమెను గొంతునులిమి చంపేసిన రాహుల్ నగదు, సెల్‌ఫోన్ తస్కరించాడు. అక్కడ నుంచి రైలులోనే ఉడాయించాడు. ఈ హత్యపై సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వివిధ రైళ్లు మారిన రాహుల్ బాంద్రా–భుజ్ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం గుజరాత్‌లోని వాపి చేరుకున్నాడు. అప్పటికే ఇతడి కదలికలు సాంకేతికంగా గమనిస్తున్న వల్సాద్ పోలీసులు అక్కడ వలపన్ని పట్టుకున్నారు. అతడి నుంచి సికింద్రాబాద్‌లో చంపిన మహిళ నుంచి తీసుకున్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇతడి అరెస్టుపై సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు.


పరిశ్రమ భవనాన్ని అలుముకున్న దట్టమైన పొగలు

ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం

మంటలతో కుప్పకూలిన ఓ భవనం

- దట్టమైన పొగలతో పరిసరాలు భయానకం
- బయటికి పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్న కార్మికులు
- ఘటనా స్థలికి 8 ఫైరింజన్లు.. ఒక బ్రాంటోస్కైలిఫ్ట్
- అర్ధరాత్రి వరకూ అదుపులోకి రాని మంటలు
- పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా

జీడిమెట్ల: జీడిమెట్ల దూలపల్లి రోడ్డులోని ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటల తాకిడికి పరిశ్రమలోని మూడు ఫ్లోర్లు దగ్ధమయ్యాయి. ఓ భవనం కుప్పకూలింది. అగ్నిప్రమాదం సంభవించగానే పరిశ్రమలోని కార్మికులంతా బయటకు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. పోలీసులు, స్థానికులు, అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. జీడిమెట్ల ఫేజ్–5 దూలపల్లి రోడ్డులో సిరాజుద్దీన్ అనే వ్యక్తి ఎస్ఎస్‌వీ ఫ్యాబ్స్ పేరిట ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే పరిశ్రమను నడుపుతున్నాడు. పరిశ్రమ గ్రౌండ్ ఫ్లోర్ సహా మరో రెండు ఫ్లోర్లు ఉండగా ఆపైన పెద్ద రేకుల షెడ్డు నిర్మించారు. పరిశ్రమలో మొత్తం 500 మంది కార్మికులు ఉండగా.. మంగళవారం జనరల్ షిఫ్టులో దాదాపు 200 మంది ఉన్నారు. మధ్యాహ్నం పరిశ్రమ మూడో అంతస్తులోని రేకుల షెడ్డులో కొంతమంది కార్మికులు ఆర్‌పీ (రీప్రాసెసింగ్) మెషీన్ వద్ద పనులు చేస్తున్నారు. 12.30 గంటల ప్రాంతంలో రేకుల షెడ్డులో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. కార్మికులు బతుకు జీవుడా అంటూ కిందకు పరుగులు తీశారు.

శ్రమించిన 50 మంది ఫైర్ సిబ్బంది..

సమాచారం అందుకున్న జీడిమెట్ల అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ పెద్ద ఎత్తున ప్లాస్టిక్ నిల్వలు ఉండటంతో భారీగా మంటలు అలుముకున్నాయి. ప్రమాద తీవ్రతను గమనించిన అగ్నిమాపక శాఖ అధికారి శేఖర్‌రెడ్డి ఉన్నతాధికారులకు వివరించడంతో 8 వాహనాలు పరిశ్రమ వద్దకు చేరుకున్నాయి. దాదాపు అయిదు ఫైర్ స్టేషన్‌ల నుంచి వచ్చిన 50 మందికి పైగా అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. మూడో అంతస్తులోకి నీటిని చిమ్మడం కష్టంగా మారడంతో బ్రాంటోస్కైలిఫ్ట్‌ను తెప్పించారు. మంటలు అర్ధరాత్రి వరకు కూడా అదుపులోకి రాలేదు.

పైనుంచి కింది అంతస్తు వరకు వ్యాపించిన మంటలు..

పరిశ్రమ విశాలంగా ఉండటంతో పాటు లోపల పెద్ద ఎత్తున ప్లాస్టిక్ బ్యాగులు నిల్వ ఉన్నాయి. పైన ఆర్‌పీ యంత్రం వద్ద అంటుకున్న మంటలు ఒక్కో అంతస్తు నుంచి నేరుగా కింది అంతస్తు వరకు వ్యాపించాయి. పరిశ్రమ భవనం మంటల తాకిడికి రెండో అంతస్తు గోడలు కూలిపోయాయి. అగ్ని ప్రమాదం సమాచారం అందడంతో ఘటనా స్థలికి బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, ఎస్ఐలు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే అగ్ని ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది.


బ్రాంటోస్కైలిఫ్ట్‌తో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

తెలుగు రాష్ట్రాల సహకార సంస్థలకు నాఫ్స్కాబ్ అవార్డులు

కరీంనగర్ డీసీసీబీకి మొదటి బహుమతి

న్యూఢిల్లీ: నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్స్ (నాఫ్స్కాబ్) 60 ఏళ్ల ఉత్సవ వేడుకలు ఢిల్లీలోని భారత్ మండపం సమావేశ మందిరంలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రఖ్యాత సహకారవేత్తలు కొండూరు రవీందర్‌రావు, భీమా సుబ్రహ్మణ్యం నేతృత్వం వహిస్తున్న ఈ జాతీయ సహకార సంస్థ 60 ఏళ్ల వేడుకలను కేంద్ర హోం, సహకార శాఖమంత్రి అమిత్ షా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఉత్తమ సేవలకు గాను నాఫ్స్కాబ్ ఏటా ఇచ్చే అవార్డులను ఈ సందర్భంగా అమిత్ షా ఆయా సంఘాల ప్రతినిధులకు అందజేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకుల్లో కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మొదటి బహుమతిని పొందగా.. కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మూడో బహుమతిని పొందాయి. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ (ఆప్కాబ్) మూడో బహుమతి పొందింది. కరీంనగర్ డీసీసీబీ పొందిన అవార్డును అధ్యక్షుడు రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావుకు అమిత్ షా అందజేశారు. ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనాథ్ రెడ్డి అవార్డు అందుకున్నారు. కేడీసీసీ బ్యాంక్ బహుమతిని పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్యామ్ మనోహర్ అవార్డు అందుకున్నారు.


అమిత్ షా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కేడీసీసీబీ పర్సన్ ఇంచార్జ్, జేసీ గీతాంజలి శర్మ, సీఈవో శ్యామ్ మనోహర్

జిల్లా వార్తలు

టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజు


బుటారి రాజు

భద్రాచలంటౌన్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యాక్షుడిగా బుటారి రాజు ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో దుమ్ముగూడెం మండలం ఆర్లగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాల క్రాఫ్ట్ ఉపాధ్యాయుడు బుటారి రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు సంఘం పటిష్టతకు కృషి చేస్తానని తెలిపారు. కాగా, రాజును టీపీటీఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు జి.హరిలాల్, కె.ముత్తమ్మ, బి.ప్రసాదరావు, కె.మాధవరెడ్డి, జె.రాంబాబు, టి.సత్తిబాబు, జె.సరళ, వి.సరియ, జె.మహేశ్, బి.రమేశ్, డి.ఉమాదేవి జి.కిషన్, ఎస్.కృష్ణబాబు, బి.హన్మంతు, ఆసియా తదితరులు అభినందించారు.

నిత్యాన్నదానానికి విరాళం


ఉద్యోగులకు చెక్కు అందిస్తున్న దాత

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీకి చెందిన భక్తుడు మంగళవారం విరాళం అందజేశారు. విజయవాడలోని రామకృష్ణాపురానికి చెందిన నర్సింహమూర్తి రూ.లక్ష చెక్కును ఆలయ ఉద్యోగులకు అందించి, స్వామిని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ లింగాల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల పీఎఫ్‌పై సమీక్ష

మణుగూరు టౌన్: సింగరేణి కార్మికుల భవిష్య నిధి(పీఎఫ్)పై సీఎంపీఎఫ్ రీజినల్ కమిషనర్ కనకమ్మ మంగళవారం సమీక్షించారు. మణుగూరులో జరిగిన ఈ సమావేశంలో ఎస్ఓటూ జీఎం శ్యాం సుందర్ మాట్లాడుతూ రిటైర్ అయిన కార్మికుల సీఎంపీఎఫ్, పెన్షన్ ప్రక్రియ పూర్తిచేయాలని, ఆడిట్ షీట్లలో వడ్డీ రేట్లు పొందుపరచాలని కోరారు. కమిషనర్ కనకమ్మ మాట్లాడుతూ సీఎంపీఎఫ్, సీఎంపీఎస్ త్వరగా చెల్లించేలా అమల్లోకి తీసుకొచ్చిన సీ–కేర్స్ పోర్టల్‌లో అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించాలని సూచించారు. అలాగే, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనం నుంచి సీఎంపీఎఫ్ రికవరీ చేయాలన్నారు. అధికారులు, నాయకులు వీరభద్రుడు, రమేశ్, అనురాధ, శేషగిరి, మదన్‌నాయక్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, అవినాష్, రాంగోపాల్, కృష్ణంరాజు, సింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పచ్చని అందాల నడుమ ఆధ్యాత్మిక శోభ


కొలువుదీరిన నాగుల్‌మీరా

- జాతీయ సమైక్యతను చాటుతున్న ప్రాంగణం
- ఆకట్టుకుంటున్న నాగుల్‌మీరా క్షేత్రం
- ఈ నెల 30 నుంచి మొదలుకానున్న ఉర్సు ఉత్సవాలు

ఇల్లెందురూరల్: అడుగడుగునా రకరకాల మొక్కలతో అల్లుకుపోయిన పచ్చని అందాల నడుమ హజ్రత్ నాగుల్‌మీరా దర్గా ప్రాంగణం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. దర్గా నిర్వాహకులు పచ్చని మొక్కలతో ప్రాంగణాన్ని తీర్చిదిద్దిన తీరు భక్తులను కట్టిపడేస్తుంది. ఈ నెల 30వ తేదీ నుంచి ఉర్సు ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యాన కథనం.

అటవీ ప్రాంతంలో..

ఇల్లెందు మండలం సత్యనారాయణపురం శివారు నుంచి సుమారు మూడు కి.మీ. దూరాన దట్టమైన అటవీ ప్రాంతంలో హజ్రత్ నాగుల్‌మీరా దర్గాను నిర్మించారు. సత్యనారాయణపురం నుంచి దర్గా వరకు మహనీయులు బోధించిన నీతివాక్యాలతో హోర్డింగ్‌లు మనిషిలో మార్పునకు పునాదులు వేసేలా దర్శనమిస్తాయి. రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు.. మధ్యలో చిన్నపాటి గుట్టలు.. అక్కడక్కడా చెరువులు ఆకట్టుకుంటాయి. దర్గా వద్దకు చేరుకోగానే తమను తాము మైమరిచిపోయేలా పచ్చందాల శోభ అహ్లాదాన్ని పంచుతుంది.

మతసామరస్యానికి ప్రతీకగా..

తరాలు మారినా సర్వమతాల సంస్కృతి ప్రతీకగా వెలుగొందుతోంది నాగుల్‌మీరా దర్గా మౌలా చాన్ చిల్లా. ఆధ్యాత్మిక చింతన, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ దర్గాను హిందూ, ముస్లిం, క్రైస్తవులు దర్శించుకుని ప్రార్థనలు చేస్తుంటారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా దర్గా ప్రాంగణంలో ఏటా సీతారాముల కల్యాణం, శ్రీరాముని మహా పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. అంతేకాక రావణుడి చెర నుంచి సీతమ్మను విడిపించేందుకు శ్రీరాముడు సముద్రంపై ప్రయాణించేలా వానర సైన్యం నిర్మించిన వంతెనకు ఉపయోగించిన నీటిపై తేలియాడే రాళ్లలో ఒకటిగా చెప్పే రామసేతు రాయిని సైతం ఇక్కడ భద్రపర్చారు. ఇలా ఆధ్యాత్మిక సంపదకు, భక్తిశ్రద్ధలకు నిలయమైన ఈ దర్గాను దర్శించుకొని ప్రార్థన చేస్తే అంతా మంచే జరుగుతుందని భక్తులు నమ్ముతారు.


దర్గా ప్రాంగణంలో భద్రపర్చిన రామసేతు రాయి

పెంపుడు జంతువులు.. పచ్చని మొక్కలు

హజ్రత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గా ప్రాంగణంలో అరుదైన పెంపుడు జంతువులు, పూల మొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఎటు చూసినా పచ్చందాల శోభ ఆకట్టుకుంటుంది. దర్గా ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లతో వీటిని పోషిస్తున్నారు. దేశవిదేశాల నుంచి సేకరించిన పూల మొక్కలు, ఆస్ట్రియా, టర్కీ తదితర దేశాల నుంచి తెచ్చిన పక్షులు, కోళ్లు, పావురాలు, కుందేళ్లు, బాతులు, ఈము పక్షులు, కూరగాయల తోటలు, పూల తోటలు, పండ్ల తోటలను ఇక్కడ చూడొచ్చు. దర్గాలో పూజల అనంతరం భక్తులు వీటిని సందర్శించి కాసేపు విడిది చేస్తారు.


అలరిస్తున్న రకరకాల పక్షులు

ప్రశాంతత కోసం..



నిత్యం వ్యాపార పనులతో బిజీబిజీగా గడిపే మేం ప్రతి శుక్రవారం నాగుల్‌మీరా దర్గాను దర్శించుకుంటాం. తద్వారా మనస్సుకు ప్రశాంతత కలుగుతుంది. ఇక్కడ ఆధ్యాత్మిక ఆనందం లభించడమే కాక ప్రకృతి ఒడికి చేరుకున్నామన్న ఆహ్లాదం కలుగుతుంది.

–కామిశెట్టి దుర్గారావు, ఇల్లెందు

విహారయాత్రకు వెళ్లినట్లుగా..



నాగుల్‌మీరా ప్రాంగణాన్ని క్రమం తప్పకుండా సందర్శిస్తుంటాం. భక్తిభావంతో పాటు ఇక్కడ అల్లుకుపోయిన పచ్చందాలు, ఆకట్టుకునే పక్షులు మానసిక ప్రశాంతత చేకూరుస్తాయి. ఇక్కడకు వస్తే విహారయాత్రకు వచ్చామా అన్న అనుభూతి వస్తుంది.

–చింత విజయలక్ష్మి, సుదిమళ్ల, ఇల్లెందు మండలం

మమత ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

80 ఏళ్ల వృద్ధుడికి ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో 80 ఏళ్ల వృద్ధుడికి మెదడు సంబంధిత శస్త్రచికిత్సను ఆరోగ్యశ్రీ ద్వారా విజయవంతంగా చేసినట్లు మమత ఆస్పత్రి కార్యదర్శి పువ్వాడ జయశ్రీ, న్యూరో సర్జన్ డాక్టర్ జగదీశ్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆస్పత్రిలో వారు వివరాలు వెల్లడించారు. చింతకాని మండలం పొద్దటూరుకు చెందిన వృద్ధుడు జి.వెంకయ్య మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా ఆస్పత్రిలో చేర్పించారని తెలిపారు. ఈ మేరకు అరుదైన శస్త్రచికిత్స చేయాల్సి ఉండటంతో హైదరాబాద్ వంటి నగరాల్లో రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. కానీ, ఇక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తిచేసినట్లు వెల్లడించారు. తల వెనక భాగంలో కండరాల మధ్య నుంచి శస్త్రచికిత్స చేయగా వెంకయ్య పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ స్వామి, ప్రిన్సిపాల్ అనురాధ పాల్గొన్నారు.


శస్త్రచికిత్స వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ జగదీశ్, పక్కన జయశ్రీ తదితరులు

పురాతన రాకాసి గూళ్లు!


వేములూరులోని దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న రాకాసి గూళ్లు



- వేములూరు వద్ద దట్టమైన అటవీ ప్రాంతంలో రాతి నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా చెక్కు చెదరని వైనం
- పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటున్న గ్రామస్తులు

అశ్వాపురం: దట్టమైన అటవీ ప్రాంతం కలిగిన ఏజెన్సీలోని మారుమూల గ్రామంలో పురాతనమైన రాకాసి గూళ్లు పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం మనుబోతులగూడెం పంచాయతీ పరిధి వేములూరులో వందల సంఖ్యలో రాకాసి గూళ్లు కనిపిస్తాయి. అశ్వాపురం, మణుగూరు మండలాల సరిహద్దుగా ఉన్న రేగులగండికి సమీపంలో కొన్ని వేల ఏళ్ల కిందటివిగా భావిస్తున్న సుమారు 1,500 రాకాసి గూళ్ల నిర్మాణాలు ఉన్నాయి.

తలదాచుకునేందుకా?

తొమ్మిది అడుగుల ఎత్తుతో సమానంగా చెక్కినట్లుగా ఉండే రాళ్లతో ఈ రాకాసి గూళ్లను పేర్చారు. రాతి యుగంలో మానవులు తలదాచుకునేందుకు ఈ నిర్మాణాలు చేపట్టి ఉంటారని తెలుస్తోంది. వేల ఏళ్ల కిందటివిగా భావిస్తున్న ఈ గూళ్లు నేటికి చెక్కు చెదరకుండా ఉండడం విశేషం. ఆదివాసీ గిరిజనులు అప్పటి మానవుల సమాధులుగా చెబుతారు. ఈ నిర్మాణాల వివరాలు తెలిసిన ఇతర ప్రాంతాల వారు చూసేందుకు వస్తుంటారు. గతంలో ఈ నిర్మాణాలను పురావస్తు శాఖ అధికారులు పరిశీలించగా.. ప్రాచీన రాతి నిర్మాణాలను సంరక్షిస్తూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. కానీ, ఆ తర్వాత అడుగు ముందుకుపడలేదు. అంతేకాక రాకాసి గూళ్ల సంరక్షణకు సైతం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో పలువురు వీటి కింద గుప్తనిధులు ఉంటాయనే అపోహతో తవ్వుతున్నారు. ఇకనైనా యంత్రాంగం స్పందించి వేళ ఏళ్ల చరిత్ర కలిగిన రాకాసి గూళ్లను కాపాడడంపై దృష్టి సారించాలని వేములూరు గ్రామస్తులు కోరుతున్నారు.

సంరక్షణ.. అభివృద్ధిపై దృష్టి సారిస్తే..

ఎన్నో ఏళ్ల కిందటి నుంచి వేములూరులో వందల సంఖ్యలో రాకాసి గూళ్లు ఉండడాన్ని గ్రామస్తులు ప్రత్యేకంగా చెబుతారు. ఈ నేపథ్యాన పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ విషయంలో ఏళ్లుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోకపోగా.. కనీసం నిర్మాణాలను రక్షించడంపైనా శ్రద్ధ పెట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. కాగా, కూనవరం, మణుగూరు, ఖమ్మంతోగు, బుగ్గ, గుండాల, ఆళ్లపల్లి, మర్కోడు, పాల్వంచ మండలం ఉలవనూరు, పాల్వంచ, అశ్వాపురం మండలం గొందిగూడెం గ్రామాల నుంచి వేములూరుకు గిరిజనులు కాలినడకన వచ్చి వస్తుమార్పిడి చేసుకునేవారని చెబుతారు. ఇలా వేములూరుకు చరిత్ర ఉన్నా కనీస రహదారి సౌకర్యం మాత్రం లేదు. ఇప్పటికైనా కలెక్టర్, అధికారులు స్పందించి రాకాసి గూళ్ల నిర్మాణాలపై పరిశోధనలు చేయించి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జనభోజనాలను జయప్రదం చేయండి

ఖమ్మంమామిళ్లగూడెం: కులమతాలకతీతంగా మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యాన డిసెంబర్ 1న ఖమ్మం పాండురంగాపురంలోని మలీదు జగన్ మామిడితోటలో జనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ శిరోమణి తెలిపారు. ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కులాల వారీగా భోజనాల సంస్కృతిని వ్యతిరేకించి ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేలా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు. సమావేశంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకినపల్లి లలిత, ఆవుల మంగతాయితో పాటు ప్రతాప్, శోభ, టి.ఝాన్సీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శిరోమణి